సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. 8లో



పోడు సాగు వివాదం

జూలూరుపాడు మండలం ఎలుకలొడ్డు గ్రామ సమీపంలో పోడు సాగు వివాదం నెలకొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 24°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, వృద్ధులు, దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్‌ ఎస్‌.వైష్ణవి రెండు వీల్‌ చైర్లను ఆలయ ఈఓ దామోదరరావుకు వితరణగా అందించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రవణ్‌ కుమార్‌, పీఆర్వో సాయిబాబు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్‌: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించాక హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. ఈఓ రజనీకుమారి, పాలక మండలి చైర్మన్‌ బాలినేని నాగేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, ఈనెల 7న పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లు బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్‌: ఆర్టీసీ వ్యాప్తంగా పలువురు డిపో మేనేజర్లను బదిలీ చేస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం డిపోల మేనేజర్లు ఉన్నారు. ఖమ్మం డిపో మేనేజర్‌ దినేష్‌కుమార్‌ కామారెడ్డి డీఎంగా, మహబూబాబాద్‌ డిపో మేనేజర్‌ ఎం.శివప్రసాద్‌ ఖమ్మం డీఎంగా, సత్తుపల్లి డీఎం యూ.రాజ్యలక్ష్మి కొత్తగూడెం డీఎంగా, నల్లగొండ డిపో సీఐ వి.సునీత పదోన్నతిపై సత్తుపల్లి డీఎంగా బదిలీ అయ్యారు. అలాగే, కొత్తగూడెం డీఎం ఎం.దేవేందర్‌ గౌడ్‌ను వనపర్తికి, భద్రాచలం డిపో మేనేజర్‌ బి.తిరుపతి హైదరాబాద్‌ ప్రధాన కార్యాలయంలో లా విభాగానికి బదిలీ కాగా, మహబూబ్‌నగర్‌ డిపో అసిస్టెంట్‌ మేనేజర్‌(మెకానికల్‌) పి.జంగయ్య పదోన్నతిపై భద్రాచలం డీఎంగా రానున్నారు. వీరంతా వారంలోగా కొత్త స్థానాల్లో చేరనున్నారు.

గోదావరి తగ్గుముఖం



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్‌: భద్రాచలం వద్ద గోదావరి నీటి ప్రవాహం గురువారం తగ్గుముఖం పట్టింది. గురువారం తెల్లవారుజాము వరకు 44 అడుగులకు చేరుకున్న నీటిమట్టం ఉదయం 8 గంటల వరకు నిలకడగా ఉంది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ సాయంత్రం 4.51 గంటలకు 42.90 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 9 గంటలకు 42 అడుగులకు చేరగా.. ఎగువ ప్రాంతాల నుంచి వరద రాకపోవడంతో నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్‌ అధికారులు తెలిపారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల

పాల్వంచరూరల్‌ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం ఎగువ 1,500 క్యూసెక్కుల నీరు రావడంతో ఒక గేటు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఇంజనీర్‌ కోరారు.

ఎమ్మెల్యే సార్‌ !



విద్యార్థులకు ఆరంభంలోనే క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పిస్తే వారి జీవితాల్లో వెలుగు రేఖలు రావడంతో పాటు పేదరికం తొలగిపోతుంది అంటున్నారు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. గతంలో ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పని చేసిన ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో తన గళం వినిపిస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థిగా, ఉపాధ్యాయుడిగా, ఎమ్మెల్యేగా అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

విద్యార్థుల్లో స్ఫూర్తి కోసమే సూటు బూటు

- అప్పుడు ఆశ్రమ బడుల్లో పురుగుల అన్నమే..
- స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌తో క్రమశిక్షణ పెరిగింది
- టీచర్ల చేతిలోనే విద్యార్థుల బంగారు భవిష్యత్‌
- పదేళ్ల పట్టుదల ఫలితమే నేటి ఎమ్మెల్యేగిరీ



విద్యార్థులతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



ఆచార్యా.. ఆదర్శం 8లో

ఆత్మగౌరవానికి ప్రతీక..

ఎమ్మెల్యేగా ఖద్దరు బట్టల్లో నిత్యం కనిపించినప్పటికీ ఏదైనా స్కూల్‌కు వెళ్లి విద్యార్థులను కలిసేప్పుడు కచ్చితంగా పైన కోటు ధరిస్తాను. కోటుతో హుందాతనం వస్తుంది. ఆత్మగౌరవం పెరుగుతుంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ చిన్ననాటి నుంచి అనేక కష్టాలు అనుభవించినా ఆత్మగౌరవ ప్రతీకగా సూటు కోటు ధరించేవారు. నేను ఎన్నో కష్టాలకు ఓర్చి ఈ స్థాయికి వచ్చాను. అందుకే విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఫుల్‌ సూట్‌ ధరిస్తుంటాను.

బియ్యంలో పురుగులు ఏరుకుని..

మాది దమ్మపేట మండలం గండుగులపల్లి. తల్లిదండ్రులు చుక్కమ్మ, సత్యనారాయణ. మాకు నాలుగెకరాల పొలం ఉండేది. అయినా ఆర్థిక ఇబ్బందులు మా కుటుంబాన్ని వెంటాడుతూనే ఉండేవి. అందుకే నా చదువంతా ఆశ్రమ పాఠశాలల్లోనే సాగింది. ఐదో తరగతి వరకు అంకంపాలెం, ఆ తర్వాత పదో తరగతి వరకు పార్కలగండి ఆశ్రమ స్కూళ్లలో, ఇంటర్‌ కిన్నెరసాని స్పోర్ట్స్‌ కాలేజీలో చదివాను. అప్పుడు ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేసే బియ్యంలో పురుగులు ఎక్కువగా ఉండేవి. ప్రతీ ఆదివారం విద్యార్థులందరం ఆ పురుగులు ఏరేవాళ్లం. అలా శుభ్రం చేసిన బియ్యాన్నే ఆ తర్వాత వారం పాటు వండిపెట్టేవారు. అలా డిగ్రీ వరకు ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ చదువుకుని ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ టీచర్‌ (పీఈటీ)గా 2005లో సున్నంబట్టి స్కూల్‌లో ఉద్యోగం సాధించా.

1998లో ప్రెసిడెంట్‌ మెడల్‌..

హై స్కూల్‌లో ఉన్నప్పటి నుంచి స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌లో చురుగ్గా ఉండేవాడిని. ఈ క్రమంలో 1998లో ఒడిశాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి (వరల్డ్‌ జంబోరి) పోటీల్లో 48 దేశాలు పోటీపడగా భారత్‌ నుంచి ఎనిమిది మందిమి ప్రాతినిధ్యం వహించాం. అందులో నాకు 'ఎ' గ్రేడ్‌ రావడంతో అప్పటి ఉపరాష్ట్రపతి కేఆర్‌ నారాయణ్‌ చేతుల మీదుగా ప్రెసిడెంట్‌ మెడల్‌ అందుకున్నాను. స్కౌట్స్‌లో పని చేయడం వల్ల చిన్నతనంలోనే క్రమశిక్షణ, సమయ పాలన, సామాజిక బాధ్యతలు అలవాటయ్యాయి. స్పోర్ట్స్‌ జూనియర్‌ కాలేజీలో ఉన్నప్పుడు రన్నింగ్‌, జావెలిన్‌త్రో, హైజంప్‌ బాగా చేసేవాడిని. దీంతో శారీరక దారుఢ్యం పెరిగింది. మ్యాథ్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసినప్పటికీ డిమాండ్‌ ఉన్న లెక్కల టీచర్‌గా వెళ్లడం కంటే విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పే పీఈటీగా పని చేసేందుకే మొగ్గు చూపాను.

రాజకీయ ప్రస్థానం..

మా మేనమామ ముత్యాలు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. ఆయన ప్రోద్బలంతో 2014లో టీచర్‌ ఉద్యోగానికి రాజీనామా చేసి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ తరఫున అశ్వారావుపేట నుంచి పోటీ చేశా. ఆ సమయంలో నాచుట్టూ ఎప్పుడూ కార్యకర్తలే ఉండేవారు. కానీ ఓటమి తర్వాత పక్కన ఉండే కేడర్‌ సంఖ్య తగ్గుతూ వచ్చింది. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం వదులుకున్నందుకు హేళన చేసేవారు. ఇది చాలదన్నట్టు ఆ ఎన్నికల్లో నాపై నెగ్గిన తాటి వెంకటేశ్వర్లు సైతం బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో 2019 ఎన్నికల్లో టికెట్‌ ఆయనకే కన్‌ఫర్మ్‌ అయింది. ఆ ఎన్నికల్లో గెలిచిన మెచ్చా నాగేశ్వరరావు కూడా బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీలో నేను మూడో స్థానానికి పడిపోగా పలకరించే వారు కరువయ్యారు.

క్రమశిక్షణ.. సమయపాలన..

స్కౌట్స్‌లో పని చేయడం వల్ల చిన్నప్పటి నుంచి అలవడిన క్రమశిక్షణ, సమయపాలన నాకు అండగా నిలిచాయి. కష్టాలు ఎదురైనా నీరుగారిపోకుండా లక్ష్యం వైపు నడిచేలా దోహదం చేశాయి. దీంతో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌ తరఫున పోటీ చేసి అశ్వారావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. ఒక వ్యక్తి లేదా సమాజం ఎదుగుదలలో విద్య ప్రాముఖ్యత తెలిసిన వాడిని కాబట్టే ఎమ్మెల్యే కోటాలో వచ్చిన రూ.10 కోట్ల నిధుల్లో రూ. 5 కోట్లు విద్య మీదనే ఖర్చు పెట్టాను. ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నా. మా ప్రాంతంలో ఉద్యాన పంటలు ఎక్కువ. అందుకే విద్యా పరిమాణాలు ఉద్యాన రైతులకు చేరువ చేసేందుకు హార్టికల్చరల్‌ యూనివర్సిటీని అశ్వారావుపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నా.

జీతంలో కొంత..

ఆశ్రమ పాఠశాలలో చదివే పిల్లలు ఒకసారి ఇంటికి వెళ్తే మళ్లీ బడి ముఖం చూడడానికి మొండికేస్తారు. అలా బడి మానేసిన విద్యార్థుల ఇళ్లకు సైకిల్‌పై వెళ్లి, అవసరమైతే ఆరోజు అక్కడే ఉండి వారిని తిరిగి బడికి తీసుకొచ్చేవాడిని. ఆ పిల్లల కుటుంబ ఆర్థిక పరిస్థితి చూసి బాధేసేది. అలాంటి పిల్లల కోసం నా జీతంలో కొంత మొత్తం ఖర్చు చేసేవాడిని కూడా. అలా నేను బడిలో చేర్పించిన పిల్లలు ఇప్పుడు చదువులో రాణిస్తుండటం చూస్తే సంతోషంగా ఉంటుంది.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

కలెక్టర్‌ జితేష్‌.వి.పాటిల్‌



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ పాటిల్‌, మ్రిణాల్‌ శ్రేష్ఠ తదితరులు

భద్రాచలంఅర్బన్‌ : భద్రాచలం గోదావరి వద్ద వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ సూచించారు. గోదావరి ఘాట్‌ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన సబ్‌ కలెక్టర్‌ మ్రిణాల్‌ శ్రేష్ఠతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిమజ్జనం విధులు నిర్వర్తించే సిబ్బంది భక్తులకు అందుబాటులో ఉండాలని, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చే భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, డీజే, సౌండ్‌ బాక్సులు ఏర్పాటు చేయొద్దని కోరారు. కాగా ఈ ఏడాది భద్రాచలంలో సుమారు రెండు వేల విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం ఉందన్నారు.

బల్లకట్టు ఏర్పాటుకు చర్యలు..

గోదావరి నదిలో జరిగే అన్ని కార్యక్రమాలకు(తెప్పోత్సవం, ఏరు ఫెస్టివల్‌, వినాయక, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం) ఉపయోగపడేలా బల్లకట్టు ఏర్పాటుకు మత్స్యశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ సూచించారు. ఇక కరకట్ట వద్ద అనధికార డంపింగ్‌ యార్డులో వేసే చెత్తతో గోదావరి నీరు కలుషితం అవుతోందని అన్నారు. రోడ్డుపైన, అనధికార డంపింగ్‌ యార్డులో చెత్త, బయోవేస్ట్‌ డంప్‌ చేసేవారికి జరిమానా విధించాలని, అయినా తీరు మారకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఈఓ శ్రీనివాసరావును ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌ ఈఈ సయ్యద్‌ అహ్మద్‌ జానీ, డీఈఈ మధుసూదన్‌, జేఈ వెంకటేష్‌, తహసీల్దార్‌ వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్‌, టౌన్‌ సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు నేరుగా అర్హులకు అందాలి

భద్రాచలంటౌన్‌: గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకే అందాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. ఆది కర్మయోగి అభియాన్‌ పథకం అమలులో భాగంగా ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలని, పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాల్లో మునగ, ఇప్ప, ఇతర చెట్లు నాటించాలని, వాటి ద్వారా కలిగే లాభాలను వివరించాలని అన్నారు. అనంతరం మూడు రోజుల శిక్షణ పూర్తయిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పీఓ రాహుల్‌, ఏపీఓ డేవిడ్‌రాజ్‌, ఏఓ సున్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై కలెక్టర్‌ సమీక్ష



మాట్లాడుతున్న గౌతమ్‌ పొట్రు, పక్కన కలెక్టర్‌ తదితరులు

కొత్తగూడెంఅర్బన్‌: జిల్లాలో నూతన బొగ్గు ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ కోసం సింగరేణి డైరెక్టర్‌(పా) గౌతమ్‌ పొట్రు, కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ అధికారులతో గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల్లో ప్రతిపాదిత బొగ్గు గనులను త్వరగా ప్రారంభించేలా భూ సేకరణతో పాటు అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్‌(పీపీ) కె.వెంకటేశ్వర్లు, డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్‌, ఆర్‌డీఓ మధు, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ సుమ, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల జీఎంలు శాలేంరాజు, దుర్గం రాంచందర్‌, వీసం కృష్ణయ్య, డీజీఎం(ఎస్టేట్స్‌) టి.హీర్యా తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

ఆశా వర్కర్ల యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



మాట్లాడుతున్న ఆశా వర్కర్ల యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఇల్లెందు: ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్‌ చేశారు. గురువారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన యూనియన్‌ జిల్లా 4వ మహాసభలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కోరారు. డబ్ల్యూహెచ్‌ఓ లాంటి అంతర్జాతీయ సంస్థలు ఆశా వర్కర్ల సేవలు గుర్తించినా కేంద్ర ప్రభుత్వం సరైన గౌరవం కల్పించడంలేదని ఆరోపించారు. ప్రమాద బీమా సదుపాయం రూ.50 లక్షలు అందజేస్తామని ప్రకటించి జీఓ విడుదల చేయటం లేదని విమర్శించారు. తొలుత యూనియన్‌ నాయకులు చీమల రమణ సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు ఎంవీ అప్పారావు, కోశాధికారి జి. పద్మ, ఆశా వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, ఎస్‌పీ నబీ, ఈసం వెంకటమ్మ, టి. కృష్ణ, సుల్తానా, వజ్జా సుశీల, హైమా, భాగ్య, విజయ, సుజాత, సుగుణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు..

భద్రాచలంఅర్బన్‌ : భద్రాచలం గోదావరి నదిలో వినాయక నిమజ్జనాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు 315 విగ్రహాల నిమజ్జనం పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నుంచి మరింతగా పెరిగే అవకాశం ఉందని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

గణపతి లడ్డూ @ రూ.లక్ష



లడ్డూ అందిస్తున్న కమిటీ సభ్యులు

దమ్మపేట : మండలంలోని మొద్దులగూడెం వినాయకుడి మండపం వద్ద గురువారం లడ్డూ వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన బాల వెంకటేశ్వరరావు రూ.లక్షకు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావుతో పాటు కుటుంబసభ్యులు ముకుందం, శ్రీనివాసరావు, రవికి లడ్డూ అందజేశారు.

వ్యవసాయ క్షేత్రాల్లో ట్రెయినీ కలెక్టర్‌



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సౌరభ్‌శర్మ

టేకులపల్లి: మండలంలోని బేతంపూడిలో గల వ్యవసాయ క్షేత్రాలను ట్రెయినీ కలెక్టర్‌ సౌరభ్‌శర్మ గురువారం పరిశీలించారు. వరి, మొక్కజొన్న, మిర్చి, టమాట పంటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పంటలకు పెట్టుబడి ఖర్చు ఎంత అవుతుంది, ఎంత ఆదాయం వస్తుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నీటికుంటల తవ్వకం, చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల ఉన్నారు.

సహకార కార్యదర్శుల బదిలీలపై స్టే

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ పరిధి పీఏసీఎస్‌ల కార్యదర్శుల బదిలీపై హైకోర్టు స్టే ఇచ్చింది. బదిలీలపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా ప్రస్తుత స్థానాల్లో కొనసాగించాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీల పరిధిలో కార్యదర్శులను బదిలీ చేయగా, ఖమ్మం డీసీసీబీ పరిధిలో 69మందికి స్థానచలనం కల్పించారు. దీనిపై రంగారెడ్డి, మెదక్‌, కరీంనగర్‌, వరంగల్‌, నల్లగొండతో పాటు ఖమ్మం కార్యదర్శులు 35మంది కోర్టును ఆశ్రయించటంతో స్టే వచ్చింది. ఫలితంగా మొత్తం కార్యదర్శుల బదిలీ ప్రక్రియ ఆగిపోయినట్లేనని భావిస్తున్నారు. ఈ అంశంపై డీసీసీబీ సీఈఓ ఎన్‌.వెంకట ఆదిత్యను గురువారం కలిసి బదిలీల్లో మార్పు చేయాలని కోరారు. అయితే, కేసు విరమించుకుంటే పునఃపరిశీలనకు అవకాశముందని తెలుస్తోంది.

గురువులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు

జిల్లాలోని పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు లభించాయి. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో వారు అవార్డులు అందుకోనున్నారు.

వ్యవసాయ కళాశాల డీన్‌కు..



హేమంత్‌కుమార్‌

అశ్వారావుపేటరూరల్‌: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ హేమంత్‌ కుమార్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. ఇప్పటికే ఆయన జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులు అందుకోగా, తాజాగా మరోసారి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో గత 18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న హేమంత్‌కుమార్‌.. 51 పరిశోధన పత్రాలు సమర్పించారు. దీంతో 2017 నుంచి 2023 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో 31 అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ విస్తరణ సేవలు అందించడంతో పాటు వ్యవసాయ కళాశాలలో స్ఫూర్తిదాయకంగా బోధన చేస్తున్నారు. కాగా, హేమంత్‌కుమార్‌కు మరో అవార్డు రావడం పట్ల వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బోధనలో ప్రత్యేక శైలి..



రమేష్‌

పాల్వంచరూరల్‌ : రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా పాల్వంచ డిగ్రీ కళాశాల బోటనీ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ దేవసాని రమేష్‌ ఎంపికయ్యారు. ఆయన ప్రత్యేక శైలిలో బోధించడమే కాక పర్యావరణ ప్రేమికుడిగా గుర్తింపు పొందారు. 1993 జూన్‌ 14న కొత్తగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన రమేష్‌.. 2001 వరకు టీచర్‌గా, 2001 నుంచి 2013 వరకు జూనియర్‌ లెక్చరర్‌గా పని చేశారు. 2013 నుంచి ఇప్పటివరకు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, మొక్కలు నాటి సంరక్షించడంతో పాటు కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను 350 నుంచి 500కు పెరిగేలా కృషి చేశారు. విద్యార్థులకు కాలేజీలో, జూమ్‌ ద్వారా ఆధునిక పద్ధతిలో బోధిస్తూ, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. వరిలో చీడపీడల నివారణకు పరిశోధన చేసి పుస్తకం రచించారు. ఇలాంటి సేవలు ఆయనను రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేశాయి. కాగా, రమేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌ పద్మ, అధ్యాపకులు గురువారం ఘనంగా సత్కరించారు.

మణుగూరు కళాశాల ప్రిన్సిపాల్‌కు..



సత్యప్రకాశ్‌

మణుగూరు టౌన్‌: అశ్వాపురానికి చెందిన నల్లగడ్డ సత్యప్రకాశ్‌ 2002లో గుంటూరులో అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించి 2021 మార్చిలో అశ్వాపురం జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో ప్రతి ఏటా గౌతమీ ఫౌండేషన్‌ సహాయంతో 30 మంది పేద విద్యార్థులకు ఏడాదికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున, మరికొందరు పేద విద్యార్థులకు ఐటీసీ ద్వారా ఏడాదికి రూ.లక్ష విలువ చేసే నోట్‌బుక్స్‌ అందించేలా కృషి చేశారు. అనంతరం మణుగూరు జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కళాశాల రూపురేఖలు మార్చడంతో పాటు అదనపు తరగతులు, సీసీ రోడ్ల నిర్మాణానికి విశేష కృషి చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేశారు. ఎఫ్‌సెట్‌, నీట్‌లో విద్యార్థులకు శిక్షణనిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేశారు. గతేడాది స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 రోజులు విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయించారు. అలాగే ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో 163 మంది పిల్లలు ఉండగా ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య 240కి పెంచి ప్రభుత్వ కళాశాల బలోపేతానికి విశేష కృషి చేశారు. గత ఆగస్టు 15న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్‌ జితేష్‌ పాటిల్‌ చేతుల మీదుగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌ అవార్డు అందుకున్నారు. సత్యప్రకాశ్‌ను ప్రస్తుతం రాష్ట్ర స్థాయి అవార్డు వరించడం పట్లఅధ్యాపకులు, విద్యార్థులు చేస్తున్నారు.

అంకితభావంతోనే అవార్డు



పర్సా సత్య శ్రీదేవి

పాల్వంచ: పాల్వంచలోని కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు పర్సా సత్య శ్రీదేవి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తాను బోధించే గణితంలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు రావడమే కాక, సొంత డబ్బుతో పాఠశాలలో పలు సౌకర్యాలు కల్పించారు. 1996లో ఉద్యోగంలో చేరిన సత్య శ్రీదేవి..మొదట పాల్వంచ అభ్యున్నత బాలికోన్నత పాఠశాలలో పని చేసి, కొమ్ముగూడెం పాఠశాలకు బదిలీ అయ్యారు. సమయ పాలన, విధుల్లో అంకితభావంతో ఉండడమే కాక విద్యార్థులతో కలిసిపోయి చదువులో ప్రోత్సహించేవారు. రూ.70వేల వ్యయంతో పాఠశాలలో ఆర్‌ఓఆర్‌ వాటర్‌ ప్లాంట్‌, రూ.35 వేలతో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. విస్తృతంగా మొక్కలు నాటించడమే కాక సొంత ఖర్చుతో పలు రకాల హెర్బల్‌, క్రోటాన్‌, పూల మొక్కలు నాటించి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేశారు. అంతేగాక తెలంగాణా మ్యాథ్స్‌ టీచర్స్‌ ఫోరం సభ్యురాలిగా ఎన్నికై పలు కార్యక్రమాలు నిర్వహించారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు.

జిల్లా స్థాయిలో 54 మందికి..

కొత్తగూడెంఅర్బన్‌: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అవార్డులకు 54 మంది ఎంపికయ్యారు. హెచ్‌ఎం కేటగిరీలో ఐదురుగు, ఎస్‌ఏ కేటగిరీలో 29 మంది, కేజీబీవీ ఎస్‌ఓలు ఇద్దరు, ఎస్‌జీటీలు 18 మంది అవార్డులకు ఎంపిక కాగా, వీరంతా జిల్లా అధికారుల చేతుల మీదుగా అందుకోనున్నారు. కాగా, పాల్వంచలోని కొమ్ముగూడెం ఉన్నత పాఠశాల టీచర్‌ సత్యశ్రీదేవి రాష్ట్ర అవార్డుకు ఎంపిక కాగా, నేడు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు.

ఆచార్యా.. ఆదర్శం

పలువురు ఉపాధ్యాయులు అంకితభావంతో పాఠాలు చెబుతున్నారు. సులభమైన పద్ధతుల్లో బోధన చేపడుతున్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీస్తున్నారు. విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నారు. క్రీడారంగంలోనూ తీర్చిదిద్దుతున్నారు. భావిభారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి కొందరు గురువులపై ప్రత్యేక కథనాలు

- విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లో విలక్షణ పద్ధతుల్లో బోధన, శిక్షణ
- క్రీడాల్లోనూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపేలా తర్ఫీదు

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఆర్చరీలో శిక్షణ పొందుతున్న గిరిజన బాలికలు

ఆటాడిస్తున్న లెక్కల టీచర్

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు విద్యార్థులకు సులభరీతిలో లెక్కలు చెబుతున్నాడు. ఆయన జాతీయస్థాయి అథ్లెట్ కావడంతో విద్యార్థులకు జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో శిక్షణనిస్తున్నాడు. దీంతో పలువురు విద్యార్థులు ఇటీవల జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఎంపికయ్యారు. 2021లో ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నాడు.



విద్యార్థులకు అథ్లెటిక్స్‌లో శిక్షణనిస్తున్న నాగేశ్వరరావు

'గురి' తప్పని మారెప్ప

పాల్వంచరూరల్: అశ్వారావుపేట మండలం గొప్పన్నగూడెం గ్రామానికి చెందిన మారెప్ప ప్రస్తుతం కాచనపల్లి బాలిక క్రీడాపాఠశాలలో ఆర్చరీ కోచ్‌గా పనిచేస్తున్నారు. గతంలో కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాలలో పనిచేశారు. ఆర్చరీలో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. 1989–90లో రష్యా, ఇటలీలో జరిగిన పోటీల్లో పాల్గొని ఇండియా టీమ్ బ్రాంజ్ మెడల్ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. వ్యక్తిగత విభాగంలో సిల్వర్‌మెడల్ సాధించారు. మారెప్ప వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు క్రీడా రంగాల్లో ఉన్నతస్థానాలకు చేరారు. కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలకు చెందిన అవంతిక, బి.సంజనశ్రీ, ఎం.గౌతమి, కె.అనందుజ, కె.లక్ష్మీసౌజన్య, కె.లవణ్య జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. కిన్నెరసాని విద్యార్థులు శివశంకర్ ఆర్మీలో, వెంకన్న రైల్వేలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించారు.

గిరిజన విద్యార్థులకు మేలు చేయాలని..



మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది ప్రతిభ కలిగిన నిరుపేద గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికి చదువుతోపాటు ఆటల్లో కూడా శిక్షణ ఇస్తే రాణిస్తారు. గిరిజనులకు ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశంతో శిక్షణ ఇస్తున్నాను. ఐటీడీఏ పీఓ ఆర్చరీ క్రీడను ప్రోత్సహిస్తున్నారు. కాచనపల్లిలో బాలికలకు విలువిద్యలో తర్ఫీదు ఇస్తున్నాను.

–మారెప్ప, ఆర్చరీ కోచ్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్/కొత్తగూడెం అర్బన్: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సుజాతనగర్, సింగభూపాలెం, గరీబ్‌పేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 134 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను స్థానిక రైతువేదికలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ రూ.60 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చుంచుపల్లి మండలం ధన్‌బాద్, అంబేద్కర్ నగర్, రాంపూర్‌లో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిసెట్టిపల్లి, లక్ష్మీదేవిపల్లిలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన జీపీ కార్యాలయ మీటింగ్ హాల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. విద్యానగర్, సారయ్య కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.70 లక్షలతో వాటర్ ట్యాంక్, నూతన పైప్ లైన్ నిర్మాణం, పైపులైన్ల పొడగింపు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. విద్యానగర్‌లో రూ.5.22 కోట్ల ఎల్‌డబ్ల్యూఈ నిధులతో నిర్మించిన భవనంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, ఎంపీడీఓ బి.భారతి, తహసీల్దార్ వి.కృష్ణప్రసాద్, నాయకులు చింతలపూడి రాజశేఖర్, నాగ సీతారాములు, ఆళ్ల మురళి, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, కూచిపూడి జగన్, రజాక్, పూనెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవార్డుల అధ్యాపకురాలు..



మంత్రి జూపల్లి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ కె.సావిత్రి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు డాక్టర్ కె.సావిత్రి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ చాటుతున్నారు. అంతర్జాతీయస్థాయిలో నాలుగుసార్లు, జాతీయస్థాయిలో అనేకసార్లు పతకాలను సాధించారు. ఆమె వద్ద శిక్షణ పొందిన నలుగురు విద్యార్థినులు అంతర్జాతీయస్థాయిలో రాణించారు. 300 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. విద్యార్థినులకు క్రీడలో శిక్షణనిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె పలు అవార్డులు అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ ఎడ్యుకేషన్ నుంచి ఎమినెన్స్ అవార్డు ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్–2025 అవార్డును రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, కల్చర్ అండ్ ఆర్కియాలజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందుకున్నారు. రోటరీక్లబ్ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు ఇచ్చి సత్కరించారు. సొంత ఖర్చులతో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

వినూత్నంగా బోధన..

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తేజావత్ మోహన్ బాబు వినూత్నంగా బోధిస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నాడు. హెచ్ఎం కాకముందు సోషల్ బోధించిన ఆయన 2023లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. స్వచ్ఛ విద్యాలయం పురస్కారం కూడా వరించింది. వీటితోపాటు మరో 24 అవార్డులు వచ్చాయి.

కథల రూపంలో బోధించాలి..

చరిత్ర, సామాజిక శాస్త్రం సబ్జెక్టులను కథల రూపంలో బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది. పాఠం పూర్తయ్యాక ప్రశ్నలు తయారు చేయాలని విద్యార్థులను ప్రోత్సహించాను. విద్యార్థులతో ప్రాజెక్ట్ వర్క్ చేయించాను. స్మార్ట్ క్లాస్ రూమ్స్ వినియోగించి, వీడియోల ద్వారా శాస్త్రీయ సూత్రాలను వివరించాను. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులతో చెట్లు నాటించాను బడిబాట కార్యక్రమాన్ని ఆదర్శంగా నిర్వహించి ఎక్కువ మంది పిల్లలు పాఠశాలలో చేరేలా చేశాను. తరగతి గది పుణ్యక్షేత్రం వంటిది. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు నావంతు కృషి చేస్తున్నాను.

–తేజావత్ మోహన్ బాబు,హెచ్ఎం



విద్యార్థుల సందేహాలను ప్రయోగరూపంలో నివృత్తి చేస్తున్న హెచ్ఎం మోహన్ బాబు

అవయవాల ఆకృతులతో..

మణుగూరు టౌన్: మణుగూరు జెడ్పీ పాఠశాలలో సైన్స్ టీచర్ పరమయ్య ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. పాఠాలను ప్రయోగపూర్వకంగా చెబుతూ విద్యార్థుల్లో సైన్స్‌పట్ల ఆసక్తి రేకెత్తిస్తున్నారు. మనిషిని పోలిన విధంగా ఉండే మేక గుండె, ఊపిరితిత్తులు వంటి భాగాలను పాఠశాలకు తీసుకొచ్చి విద్యార్థులకు వాటి పని విధానంపై వివరిస్తారు. చార్ట్ వర్క్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వారిలో పరిజ్ఞానం పెంచేందుకు కృషిచేస్తున్నారు. చమ్కీలు, చొక్కా బటన్స్, స్టిక్కర్స్, క్లే, దారం వంటి వాటితో మానవ అవయవాల ఆకృతులు తయారు చేసి బోధన చేపడుతున్నారు. వీఆర్, ఏఆర్ టెక్నాలజీని సమ్మిళితం చేసి పాఠాలు బోధిస్తున్నారు. ఎన్‌జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్)లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా ఐదేళ్ల పనిచేసిన ఆయన ఉత్తమ టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్స్ (టీఎల్ఎం) తయారు చేశారు. అది దేశ వ్యాప్తంగా రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో జరిగిన సీసీఆర్‌టీకి ఎంపికైంది. పలుమార్లు జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు బోధనాపద్ధతులపై శిక్షణ కూడా ఇచ్చారు.



ఉపాధ్యాయుల అవగాహన కార్యక్రమంలో ఊపిరితిత్తుల పనితీరు వివరిస్తున్న పరమయ్య

విద్యార్థుల్లో గ్రహణశక్తి పెంచాలి

విద్యార్థులకు బోధించే పాఠం ఎంతమేరకు అర్థమవుతుందనేదే ముఖ్యం. మారుతున్న టెక్నాలజీతో పాటు దైనందిన అంశాలతో ముడి పడి ఉన్న అంశాలు క్షుణ్ణంగా వివరించాలి. ప్రయోగాలు చేస్తూ వాటిలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విద్యాబోధన చేయడం వారికి పరిజ్ఞానం పెరుగుతుంది.

–పరమయ్య, సైన్స్ ఉపాధ్యాయుడు

వసతుల కల్పనకు కృషి

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవి నిబద్ధతతో పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మకవిద్య అందించడంతోపాటు సామాజిక సేవలో భాగస్వాములను చేస్తున్నారు. ఏ పాఠశాలలో పనిచేసినా మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నారు. రవి అంకితభావాన్ని గుర్తించిన గ్రామస్తులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు మార్చారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా పిల్లలను సర్కారు బడిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు సొంత డబ్బుతో కరపత్రాలు వేయించి ఇంటింటి ప్రచారం చేపట్టారు. బాల కార్మికులు, బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాల, వసతిగృహాల్లో చేర్పించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములు చేస్తున్నారు. దాతల సాయంతో విద్యార్థులకు ప్లేట్లు, టేబుళ్లు, కుర్చీలు, నోటుపుస్తకాలు, టీవీ, సౌండ్‌బాక్స్‌లు, బీరువా తదితర సౌకర్యాలు సమకూర్చారు. బాలల కమిటీలు వేసి పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం, తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బ్యాడ్జీలు పెట్టి ప్రోత్సహించడం, తల్లిదండ్రులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆదివాసీ హెల్ప్ సెంటర్ ద్వారా సామాజిక సేవలు కూడా అందిస్తున్నారు.



పాఠశాలకు టీవీ వితరణ చేస్తున్న గ్రామస్తులు

పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ..

టేకులపల్లి: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.మోహన్‌రావు కృషి చేస్తున్నారు. ఉన్నతి, వృత్యంతర శిక్షణలో జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పని చేసి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేత ప్రశంసలు పొందారు. ఆయన పర్యవేక్షణలో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించారు.

- 2019లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాజేశ్వరి తయారు చేసిన గాలి మరల ద్వారా విద్యుదుత్పత్తి ప్రాజెక్ట్ సైన్స్‌ఫేర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. 2024లో సైన్స్‌ఫేర్‌లో నెల్లూరి గీత జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి పొందింది.
- 2022లో చెకుముకి పోటీల్లో విద్యార్థులు గీత, శ్రీహరి, హర్షిత జట్టు జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు.
- 2024లో చెకుముకి పోటీలో దివ్యశ్రీ, శ్రీహరిణి పవార్, గీతలు జిల్లాలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో నాలుగో బహుమతి సాధించారు.
- 2018–19లో విద్యార్థులు తేజావత్ రామరాజు, కోరండ్ల సాయికిరణ్, 2023–24లో తేజస్వి, మహేందర్, గీతాంజలి, గురుచరణ్‌లు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు.
- 2019–20లో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో విద్యార్థులు కార్తికేయని, పావని, చరణ్‌తేజ, గ్రీష్మలు జిల్లా ద్వితీయ బహుమతి, 2025లో నిర్వహించిన టాలెంట్ టెస్టులో నెల్లూరి గీత జిల్లా ప్రథమ బహుమతి పొందారు.



రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులతో మోహన్‌రావు తదితరులు

సైబర్ కేసు నమోదు

ఆరోగ్య శ్రీ పేరుతో టోకరా

భద్రాచలంఅర్బన్: ఆరోగ్య శ్రీ పేరుతో సైబర్ నేరస్తులు ఇద్దరు మహిళల నుంచి నగదు కాజేశారు. ఈ ఘటనలపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన యువతి సోయం సత్యవతికి గత జూన్ 30న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ఆరోగ్యశ్రీ శాఖ నుంచి మాట్లాడుతున్నానని, రూ.25 వేలు నగదు మంజూరైందని, అవి మీ అకౌంట్‌లో జమకావాలంటే ఓటీపీ చెప్పాలని కోరాడు. దీంతో ఓటీపీ చెప్పగా, ఆమె అకౌంట్‌లో నుంచి రూ.12,611 నగదు కాజేశారు. అనంతరం సత్యవత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. పట్టణంలోని ఏఎస్‌ఆర్ కాలనీకి చెందిన మహిళ లక్ష్మికి కూడా 2023 సెప్టెంబర్ 22న అదే తరహాలో ఫోన్ చేసి రెండు దఫాలుగా రూ.30,280 నగదు కాజేశారు. ఆమె కూడా 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

ములకలపల్లి: ములకలపల్లి పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్. మధుప్రసాద్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన బాలికను పాతగంగారానికి చెందిన యువకుడు గురువారం బాల్యవివాహం చేసుకుంటున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకునేలోగానే వివాహం జరిగిపోయింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.నాగమణి ఫిర్యాదుతో యువకుడితోపాటు అతని తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో రైతు మృతి



వజ్జా లక్ష్మయ్య (ఫైల్)

టేకులపల్లి: పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ ముర్రుట్ల గ్రామానికి చెందిన వజ్జా లక్ష్మయ్య (40) చేలో పనిచేస్తుండగా పాము కాటువేసింది. దీంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి కాలినడకన బయలుదేరాడు. ఎదురొచ్చిన కుటుంబీకులు అతడిని తొలుత గ్రామీణ వైద్యుడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన లేకపోవడంతో సులానగర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడా వైద్యులెవరూ లేకపోవడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

పాల్వంచరూరల్: ఐదుగురిపై గురువారం వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన షేక్ అలేఖ్య బేగానికి ఏపీ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా కంచికచర్ల మండలం కీసరగ్రామానికి చెందిన మౌలాలీతో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యులు హుస్సేన్, బీబీ, ఖాసీంబీ, షరీఫ్‌లు వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త సహాయ ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సురేశ్ తెలిపారు.

పోడు సాగు వివాదం

ఐదుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు: మండలంలోని ఎలుకలొడ్డు గ్రామ సమీపంలో పోడు సాగు వివాదం నెలకొంది. పాపకొల్లు బీట్–బీ, కంపార్ట్‌మెంట్ 31లోని రాసగానిగుట్ట దగ్గరలో అటవీ అధికారులకు, గొత్తికోయలకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. కొందరు గొత్తికోయలు అక్రమంగా మారుజాతి, తదితర కలప చెట్లు నరికి పోడు భూమిలో పత్తి సాగు చేపట్టారు. ఈ క్రమంలో గత నెల 29న పాపకొల్లు అటవీ సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్–బీ ఆఫీసర్ కె.విజయలక్ష్మి, వాచర్ తేజావత్ రాము అటవీభూమిలో వెదురు మొక్కలు నాటేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆదివాసీలకు, అటవీశాఖ సిబ్బందికి మధ్య వాగ్వాదం నెలకొని ఘర్షణకు దారితీసింది. గొత్తికోయ మహిళ ఇడిమా, ఎఫ్‌బీఓ విజయలక్ష్మి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాడుతున్న దృశ్యాలు గురువారం సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాగా 29నే బీట్ ఆఫీసర్ విజయలక్ష్మి జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివాసీలు మడి సీతారాములు, మడి ప్రవీణ్, మడి ముత్తమ్మలు ఇడిమాను రెచ్చగొట్టారని, దీంతో ఆమె ఎఫ్‌బీఓపై రాయితో దాడి చేసిందని, బచ్చల నర్సమ్మ అనే మహిళ కూడా దురుసుగా ప్రవర్తించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బీట్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు మడి సీతారాములు, ప్రవీణ్, ముత్తమ్మ, ఇడిమా, నర్సమ్మ ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.



ఘర్షణ పడుతున్న బీట్ ఆఫీసర్, గొత్తికోయ మహిళ

29న ఫిర్యాదు చేస్తే.. 4న కేసు నమోదు

పోడు సాగును అడ్డుకునేందుకు వెళ్లిన ఎఫ్‌బీఓ విజయలక్ష్మి, గొత్తికోయ మహిళ మధ్య ఘర్షణ జరిగిందని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు తెలిపారు. ఎఫ్‌బీఓపై గొత్తికోయ మహిళ దాడి చేసిందన్నారు. కాగా ఈ ఘటనపై గత నెల 29న అటవీశాఖ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు గురువారం విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు. ఫిర్యాదు చేశాక ఆరు రోజుల తర్వాత కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ సందర్భంగా ఎఫ్‌బీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ తనను దూషించి, దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. అటవీ ప్రాంతంలో విధులకు వెళ్లాలంటేనే భయంగా ఉందని పేర్కొంది.

భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో బాలింత మృతి



సింధు(ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో గురువారం ఉదయం మూడు రోజుల బాలింత మృతి చెందింది. బూర్గంపాడు మండలం సారపాక గాంధీనగర్‌కు చెందిన గర్భిణి అంజలముడి సింధు (25)ను ప్రసవం కోసం ఈ నెల 1న మధ్యాహ్నం ఆస్పత్రిలో చేర్చారు. అదే రోజు సాయంత్రం వైద్యులు ఆమెకు సిజేరియన్ చేయగా, ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కాగా బుధవారం ఉదయం సింధు నోట్లో నుంచి నురగ వచ్చి, కోమాలోకి వెళ్లింది. దీంతో ఐసీయూకు తరలించి వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. స్థానిక కార్డియాలజిస్ట్ సాయితేజ రెడ్డి వచ్చి పరీక్షించగా ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టినట్లు తేలింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. పుట్టిన బిడ్డ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను వివరణ కోరగా.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాలింత మృతి చెందలేదని, ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డం కట్టడంతో మృతి చెందిందని తెలిపారు.